అసత్యంతో సాధించిన
విజయం కంటే..
సత్యంతో సాధించిన
పరాజయమే మేలు
- మహాత్మా గాంధీ

Truth of News
PRGI Reg No: APTEL/26/A4782
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 09 | సోమవారం 03 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# గోదావరి ఉగ్రరూపం..

- ఇంకా ముంపులోనే లంక గ్రామాలు
- గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి
- కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు
- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ట, గౌతమి పాయలు
- అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు



**రాజమండ్రి - సూర్య వాస్తవం**
ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు

- మిగతా 2లో..

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

- యువతకు ప్రధాని మోదీ పిలుపు
- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**
దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో

- మిగతా 2లో..



# రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'?

- ఆగస్టు 5న కీలక నిర్ణయం
- రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ
- ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం
- నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు
- ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై స్పష్టత
- సమావేశం తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించనున్న అభిజీత్ దీప్కే

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**
ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ

- మిగతా 2లో..



# ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం..

- మంత్రి లోకేశ్ చొరవతో 4 ఎంఓయూలు
- ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక ఒప్పందాలు
- గతంలో మంత్రి లోకేశ్ పర్యటనకు కొనసాగింపుగా కుదిరిన ఎంఓయూలు
- ఏపీలో సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- ఆటిజం విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- యువతకు ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్న మంత్రి లోకేశ్

**అమరావతి - సూర్య వాస్తవం**
ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇరుప్రాంతాల మధ్య అభివృద్ధి, నైపుణ్యం, ఆవిష్కరణలే లక్ష్యంగా నాలుగు కీలక రంగాల్లో వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) కుదిరాయి. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌ల సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. గతేడాది తాను ఆస్ట్రేలియాలో జరిపిన పర్యటన సందర్భంగా జరిగిన చర్చలకు ఇది కార్యాచరణ రూపమని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా తెలిపారు.

మంత్రి నారా లోకేశ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఒప్పందాలు రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కుదిరాయి. ముఖ్యంగా క్లీన్ ఎనర్జీ,

- మిగతా 2లో..



# అదనపు పన్నుల వాటా కేటాయింపు..

- కేంద్రానికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల
- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- ఈ సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని వెల్లడి
- కేంద్ర సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు

**అమరావతి - సూర్య వాస్తవం**
ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటాను విడుదల చేయడంపై

- మిగతా 2లో..



# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

- కోర్టులో హాజరు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు

**అమరావతి - సూర్య వాస్తవం**
అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర

## - అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

- కుటుంబ సమేతంగా తొలి బంగారు బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- భారీగా తరలివచ్చిన భక్తజనం.. ముమ్మర ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- దర్శించుకున్న పలువురు మంత్రులు, రాజకీయ ప్రముఖులు
- జాతరలో ఏర్పాట్లపై జోగినుల ఆవేదన నేటి భవిష్యవాణికి ఏర్పాట్లు పూర్తి



**బేగంపేట - సూర్య వాస్తవం**
సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- మిగతా 2లో..



# ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్

2లో

# గోదావరి ఉగ్రరూపం..

(మొదటిపేజీ తరువాయి)

నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యిన విల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహి స్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం..

(మొదటిపేజీ తరువాయి)

అత్యాధునిక తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి వంటి రంగాల్లో ఈ భాగస్వామ్యం కీలకం కానుంది. ప్రతిభ, ఆవిష్కరణ, ఉమ్మడి శ్రేయస్సు పునాదులపై ఆంధ్రప్రదేశ్-ఆస్ట్రేలియా భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఈ ఒప్పందాలు దోహదపడతాయని లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా బృందం సీఎం చంద్రబాబుతోనూ సమావేశమైంది.

**సౌరశక్తి హబ్‌గా ఆంధ్రప్రదేశ్**

పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల హబ్‌గా మార్చే దిశగా తొలి అడుగు పడింది. ఐఐటీ తిరుపతి, ఏపీ ప్రభుత్వానికి చెందిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), సిడ్నీకి చెందిన యూఎన్ఎస్ డబ్ల్యూ యూనివర్సిటీ సంయుక్తంగా ఏపీలో "సోలార్ మాన్యుఫ్యాక్చరింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా అత్యాధునిక సోలార్ పీవీ తయారీ, రీసైక్లింగ్, పరిశ్రమ ఆధారిత పరిశోధన, ఫ్యాకల్టీ అభివృద్ధి, ప్రపంచస్థాయి నైపుణ్య శిక్షణపై దృష్టి సారిస్తారు.

**విద్య, మానసిక ఆరోగ్యానికి పెద్దపీట**

"ప్రతి చిన్నారి నేర్చుకోవడానికి, ఎదగడానికి, రాణించడానికి అర్హులు" అనే ఉద్దేశంతో ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ అభ్యసన అవసరాలున్న విద్యార్థులకు సమ్మిళిత విద్యను బలోపేతం చేసేందుకు మరో ఒప్పందం కుదిరింది. యూఎన్ఎస్ డబ్ల్యూ సిడ్నీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తాయి. ప్రత్యేక ఉపాధ్యాయులకు, సాధారణ టీచర్లకు ఆధునిక శిక్షణ అందించి, ఏపీ విద్యార్థుల అవసరాలకు తగిన వనరులను అభివృద్ధి చేస్తారు.అలాగే, విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తూ, రౌండ్ డింపుల్ సంస్థ భాగస్వామ్యంతో ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. దీని ద్వారా విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా గోప్యంగా వెల్‌నెస్ అసెస్‌మెంట్‌లు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు.

**ప్రపంచస్థాయి ఉద్యోగాలకు యువత తయారీ**

రాష్ట్ర యువతకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ఏపీఎస్ఎస్‌డీసీ, ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా వృత్తి విద్య, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, వృత్తిపరమైన ధ్రువపత్రాలు, అంతర్జాతీయ ఉపాధి మార్గాలను బలోపేతం చేస్తారు. ఈ చర్యల ద్వారా నేటి ఉద్యోగాలకే కాకుండా, రేపటి కెరీర్‌లకు సైతం ఏపీ యువతను సిద్ధం చేస్తున్నామని లోకేశ్ వివరించారు.

## ఘనంగా ఉజ్జయిని మహంకాళి

# బోనాల జాతర

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అనుసూయ (సీతక్క) అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ఈవో గుత్తా మనోహర్ రెడ్డి ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు సీఎం రేవంత్ రెడ్డికి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం పలికారు. ?

**తొలి బంగారు బోనం సమర్పించిన మంత్రి పొన్నం**

అంతకుముందు ఉదయం 4.05 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి తొలి బంగారు బోనంతో పాటు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఆలయానికి ప్రముఖుల తాకిడి**

బోనాల జాతర సందర్భంగా ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, కాలేరు వెంకటేష్, మర్రి రాజశేఖర్ రెడ్డి, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, సాంస్కృతిక సారథి చైర్మెన్ వెన్నెల, సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దీపక్ జాన్, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ, సీపీ సజ్జనార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అమెరికా కాన్సుల్ జనరల్ లారా ఈ.విలియమ్స్, హీరోయిన్ వైష్ణవి అమ్మవారికి బోనం సమర్పించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అధికారుల నిరంతర పర్యవేక్షణ**

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం సకల ఏర్పాట్లు చేసింది. దేవాలయ చైర్మెన్ రామేశ్వర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, ఈవో మనోహర్ రెడ్డితో పాటు జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, మెడికల్, ఫైర్, విద్యుత్, పోలీస్ శాఖల అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఆలయ పరిసరాల్లో ఉచిత వైద్య శిబిరాలు, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు.??

**బోనాల్లో అపశృతి.. జోగినుల కన్నీటి ఆవేదన!**

సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతరలో ఏర్పాట్ల లోపం, రద్దీ నియంత్రణ రాహిత్యంపై జోగినులు, శివసత్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించేందుకు వచ్చిన తమకు ఆలయ యంత్రాంగం, పోలీసుల నుంచి సరైన సహకారం అందలేదని జోగిని శ్యామలతో పాటు పలువురు జోగినులు కన్నీటిపర్యంతమయ్యారు. తరతరాలుగా సంప్రదాయబద్ధంగా అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ సేవలు అందిస్తున్న తమకు ఆలయం వద్ద కనీస గౌరవం, ప్రాధాన్యత ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒరద్దీ ఎక్కువగా ఉండటం, తోపులాట జరగడంతో ఎంతో నిష్ఠతో నెత్తిన ఎత్తుకొచ్చిన బోనాలు కిందపడే పరిస్థితి వచ్చిందని తెలిపారు. అధికారులు కేవలం వీఐపీలకే ప్రాధాన్యత ఇస్తూ, భక్తితో వచ్చిన జోగినులను, భక్తులను తీవ్ర ఇబ్బం దులకు గురిచేశారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి, రాబోయే రోజుల్లో శివసత్తులకు, జోగినులకు సముచిత స్థానం కల్పించి, దర్శనానికి ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయాలని కోరారు. సాధారణ క్యూలైన్‌లో వచ్చే భక్తులు, బోనాలతో వచ్చిన వారు సరైన సౌకర్యాలు లేవని అసహనం వ్యక్తం చేశారు. అక్కడక్కడ పోలీసులు కొంత అత్యుత్సాహం ప్రదర్శించారు. అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించనున్న భవిష్యవాణి(రంగం) కార్యక్రమానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

(మొదటిపేజీ తరువాయి)

దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

**అసలేం జరిగింది?**

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**పోలీసుల కథనం ప్రకారం..**

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

**అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ**

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

**ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం**

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు.

వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

## వికసిత భారత్ కోసం

# డ్రగ్స్‌కు దూరం

(మొదటిపేజీ తరువాయి)

నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢీ)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## రాజకీయాల్లోకి

# 'కాక్రోచ్ జనతా పార్టీ'?

(మొదటిపేజీ తరువాయి)

వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

# అదనపు పన్నుల వాటా కేటాయింపు..

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో అందిన ఈ ఆర్థిక చేయూత రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల అవుతుంది. అయితే, ఈసారి గడువుకు ముందే ఏపీకి అదనంగా రూ.4,597 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అదనపు పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజల తరపున ధన్యవాదాలు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. ఈ సహకారం రాష్ట్ర పురోగతికి గొప్పగా దోహదపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులు, రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఊతమిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా

# ఉగ్రవాదా?: జగన్

**అమరావతి - సూర్య వాస్తవం:** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు.

# భారత్‌కు జిన్ పింగ్




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

2020లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత్‌చైనా సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత దాదాపు ఆరేళ్లపాటు భారత ప్రధాని నరేంద్రమోదీ చైనాకు వెళ్లలేదు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్‌ను సందర్శించలేదు. ఇటీవలే భారత్‌చైనా సంబంధాలు మళ్లీ పునరుద్ధరణ జరిగింది. ఈ క్రమంలో ప్రధాని నరేంద్రమోదీ కొన్ని నెలల క్రితం చైనా పర్యటనకు వెళ్లారు. ఇక ఇప్పుడు సెప్టెంబర్ 12,13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సమ్మిట్‌కు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో రెండు దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతలను మరింత తగ్గించి, కొత్త సంబంధాల పునాది వేసే అవకాశంగా ఉంది.గల్వాన్ ఘర్షణ తర్వాత సరిహద్దు ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలు, వాణిజ్య పరిమితులు వంటివి రెండు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 2019లో మామల్లపురంలో జరిగిన అనధికారిక సమ్మిట్ తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రాలేదు. అయితే ఇటీవలి కాలంలో ఇరు దేశాల సంబంధాల్లో కొంత మెరుగుదల కనిపిస్తోంది. 2024లో కజాన్‌లోనూ, 2025లో తియాన్‌జిన్‌లోనూ ప్రధాని మోదీ, జిన్‌పింగ్ కలుసుకున్నారు. సరిహద్దు విషయంలో కొన్ని అవగాహనలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ రాక భారత్?చైనా సంబంధాల్లో మరో ముఖ్యమైన మలుపుగా మారే అవకాశం ఉంది.భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న సందర్భంలో జరుగుతున్న ఈ సమ్మిట్ ప్రపంచ రాజకీయాల్లో కూడా ముఖ్యమైనది. రష్యా, ఇరాన్ వంటి దేశాల నాయకులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియా సంక్షోభం, గ్లోబల్ సౌత్ సమస్యలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చల్లో ఉంటాయి. జిన్‌పింగ్ హాజరైతే ప్రధాని మోడీతో ద్వైపాక్షిక చర్చలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. సరిహద్దు సమస్యలు, వాణిజ్య అసమతుల్యత, పెట్టుబడులు వంటి అంశాలపై చర్చ జరగవచ్చు.ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య నమ్మకం పెరిగే అవకాశం ఉంది. వాణిజ్య సంబంధాలు మెరుగుపడటం, సరిహద్దు ఉద్రిక్తతలు మరింత తగ్గడం, బహుపక్ష వేదికల్లో సహకారం పెరగడం వంటి ఫలితాలు రావచ్చు. అయితే సరిహద్దు విషయంలో ఇంకా పూర్తి పరిష్కారం లేకపోవడం, పరస్పర అపనమ్మకం, ప్రాంతీయ రాజకీయాలు వంటివి సవాళ్లుగా ఉంటాయి. అయితే జిన్‌పింగ్ పర్యటనపై? అధికారిక ప్రకటన ఇంకా రాలేదుగల్వాన్ ఘటన తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్‌కు రావడం రెండు పెద్ద ఆసియా శక్తుల మధ్య సంబంధాలను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. బ్రిక్స్ వేదిక దీనికి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అయితే నిజమైన పురోగతి సరిహద్దు, వాణిజ్య సమస్యలపై కాంక్రీట్ చర్యలపైనే ఆధారపడి ఉంటుంది.

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..



**విజయవాడ - సూర్య వాస్తవం**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు.

తొలిసారి విజయ్ ను ముఖ్యమంత్రి పీఠం పై కూర్చోబెట్టడంలో కపిల్ సాహు కీలకంగా వ్యవహరించారు. తక్కువ సీట్లు వచ్చినప్పటికీ కపిల్ సాహు టీం సోషల్ మీడియాలో డ్రైవ్ చేయడం, విజయ్ కు అనుకూలంగా మార్చడంలో సక్సెస్ అయ్యారు. ఇదే విషయాన్ని వైసీపీ అధినేత జగన్ గుర్తించి ఆయనను తనకు 2029 ఎన్నికల వ్యూహకర్తగా ఉండాలని కోరినట్లు తెలిసింది. దీంతోకపిల్ సాహు ఇందుకు అంగీకరించినట్లు తెలసింది. ఇప్పటికే కపిల్ సాహు టీం జగన్ వ్యవహారాలను పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతతిన్నాయి. ప్రశాంత్ కిషోర్ సంస్థ ఐ ప్యాక్ లో పనిచేసిన అనుభవంతో,డాటా విశ్లేషణ, ప్రచార ప్రణాళికలు రూపొందించడంలో కపిల్ సాహు టీంకు మంచి పేరు ఉండటంతో జగన్ దృష్టిలో పడ్డారు. తనకు ప్రధాన మీడియా వ్యతిరేకం కావడం, డిజిటల్ ప్రచారంపై ఎక్కువగా ఆధారపడి రావాల్సి ఉండటంతో జగన్ కపిల్ సాహును ఎన్నికల వ్యూహకర్తగా ఎంచుకున్నా రంటుననారు. తాను నేరుగా ఎక్కువ మీడియా సమావేశాల్లో పాల్గొనకపోయినా, సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి వెళ్లేలా పటిష్టమైన వ్యూహాన్ని అమలు చేయడం, సంక్షోభ సమయాల్లో సమన్వయం, ప్రచార సరళిని నిర్వర్తించడంలో కపిల్ సాహు బృందం కీలక పాత్ర పోషించనుందని చెబుతున్నారు. మరి కపిల్ సాహు ఎంత మేరకు సక్సెస్ అవుతారో చూడాలి.

# మండలి కోసం వడపోతలు షురూ

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర, జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది.

ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవు తున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు.

ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

# ఫుల్ రేంజ్ లో లోకేష్ పాలిటిక్స్

**విజయవాడ - సూర్య వాస్తవం**



మంత్రి నారా లోకేష్.. ఫుల్ రేంజ్‌లో తన రాజకీయా లను విస్తరిస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీపై ఆయ న పట్టు పెంచుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు సక్సెస్ అవుతున్నాయి. నియోజకవర్గాలు, జిల్లాలు.. ఇలా ఎక్కడ ఎప్పుడు ఏది అవసరమో గుర్తించి.. దానికి అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. ఒకవైపు పాలన చూసు కుంటూ.. మరోవైపు.. పార్టీ పనుల్లోనూ బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా కర్నూల్లో నిర్వహించిన సమావేశం లోకేష్ దూకుడుకు పక్కా రియాక్షన్ ఇచ్చింది. =పార్టీ కార్యక్రమాలకు ఇటీవల కాలంలో దూరంగా ఉంటూ వచ్చిన వారు కూడా.. తాజాగా లోకేష్ వస్తున్నారని తెలిసిన వెంటనే నాయకులు క్యూకట్టారు. అప్పటి వరకు ఉన్న విభేదాలను కూడా కొందరు నాయకులు దూరం పెట్టి చేతులు కలిపారు. లోకేష్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు భేషజాలకు పోకుండా చేతు లు కలిపారు. ఇది.. పార్టీలో ఐక్యతకు నిదర్శనంగా మారిందని సీనియర్లు చెబుతున్నారు. నిజానికి కొన్నాళ్లుగా కర్నూలు తమ్ముళ్ల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ం. నిజానికి టీడీపీలో తరం మారుతున్న సంధికాలంలో నాయకుల పరిస్థితి.. అధిష్టానం ఆలోచనలు వంటివి ప్రత్యేకంగా చర్చకు వస్తున్నాయి. చంద్రబాబుకు లోకేష్‌కు మధ్య వ్యత్యాసం.. దూకుడు వంటివి నాయకుల మధ్య ఆలోచనలను మారుస్తున్నాయి. చంద్రబాబు అయితే.. చెప్పింది వింటారు.. బుజ్జగిస్తారు.. సమయం ఇస్తారు.. అనే భరోసా ఉంటుంది. దీంతో తప్పులు చేసిన నాయకులు కూడా వివరణ, విచారణలతో ఏదో ఒకరకంగా బయట పడుతున్నారు.కానీ, లోకేష్ విషయానికి వస్తే.. ఆయన దగ్గర ఇలాంటి కుదరడం లేదు. దీనికి అనేక ఉదాహరణలు కూడా ఉన్నాయి. మైలవరం నుంచి పెనమలూరు వరకు.. పలు నియోజకవర్గాల్లో చోటు చేసుకున్న వివాదాలను లోకేష్ తనదైన శైలిలో పరిష్కరించారు. ఆయనేమీ సాగదీత ధోరణికి చాన్స్ ఇవ్వరు. ఫటాఫట్.. అన్నట్టు గా నాయకులతో మొహంమీదే మాట్లాడేస్తున్నారు. దీంతో నాయకుల మధ్య ఐక్యత పెంచేందుకు.. పార్టీని లైన్‌లో పెట్టేందుకు ఈ పరిణామాలు దోహదపడుతున్నాయి. ఇదే ఇప్పుడు కర్నూలులో నాయకులు తిరిగి కలుసుకునేందుకు అవకాశం కల్పించిందని అంటున్నారు.

# యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజా యాదవ్



**- యాదవుల ఐక్యత, సంఘ బలోపేతానికి కృషి చేస్తానన్న రాజా యాదవ్**
**- యాదవుల సమస్యలపై నిరంతరం పోరాడతానని హామీ**

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజా యాదవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం అనంతపురంలోని నక్కా రామారావు యాదవ భవన్‌లో నిర్వహించిన జిల్లా యాదవ సంఘం సమావేశంలో ఆయనను జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, రాష్ట్ర నాయకులు రాజశేఖర్ యాదవ్, నారాయణస్వామి యాదవ్ తదితరులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా, మండల స్థాయి నూతన కమిటీలను కూడా ఎన్నుకున్నారు. అనంతరం యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ, రాజా యాదవ్ గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుగా కొనసాగుతూ అనంతపురం జిల్లాలో అందరికీ సుపరిచితుడిగా ఉన్నారని పేర్కొన్నారు. యాదవుల ఐక్యత కోసం కృషి చేయడంతో పాటు సామాజిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆయనకు సూచించారు.ఈ సందర్భంగా రాజా యాదవ్ మాట్లాడుతూ, తనను జిల్లా యాదవ సంఘం ఉపాధ్యక్షుడిగా నియమించిన యాదవ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. యాదవ సోదరుల ఐక్యత, సంఘం బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని, వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాల్లో త్వరలో వివిధ స్థాయిల కమిటీలను ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు యాదవ పెద్దలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులు ఏ రాజకీయ పార్టీలో ఉన్నప్పటికీ వారి రాజకీయ, సామాజిక బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. యాదవులకు ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ పార్టీకే యాదవుల మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా యాదవ సంఘం నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

## అర్బన్‌లో ఇంటి పట్టాల సమస్యలు పరిష్కరించాం: తహశీల్దార్ రాజా



**అనంతపురం అర్బన్– సూర్య వాస్తవం:** నగరంతో పాటు నాలుగు పంచాయతీల పరిధిలో ఇంటి పట్టాలకు సంబంధించిన సమస్యలు అధికంగా ఉన్నాయని అనంతపురం అర్బన్ తహశీల్దార్ రాజా తెలిపారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెలలో ఇంటి పట్టాల సమస్యలకు సంబంధించి మొత్తం 48 అర్జీలు అందాయని, వాటిలో 27 మంది సమస్యలను ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. మిగిలిన అర్జీలను కూడా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పట్టా భూముల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులపై సంబంధితులకు తాఖీదులు జారీ చేశామని, నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి సమస్యలకు పరిష్కారం చూపుతామని తహశీల్దార్ రాజా పేర్కొన్నారు.

## అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**- అధ్యక్షుడిగా తోట చెన్నప్ప.. ప్రధాన కార్యదర్శిగా ఆర్. శ్రీనివాసులు**

**- వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రధాన లక్ష్యమన్న క్యాప్కో చైర్మన్**

**- నూతన కార్యవర్గానికి సభ్యులు, ప్రతినిధుల అభినందనలు**



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య నూతన అధ్యక్షుడిగా తోట చెన్నప్ప, ప్రధాన కార్యదర్శిగా ఆర్. శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య (క్యాప్కో) చైర్మన్ జి. సురేష్ కుమార్ తెలిపారు. ఆదివారం అనంతపురం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రంలో ఆర్. శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన క్యాప్కో రాష్ట్ర చైర్మన్ జి. సురేష్ కుమార్ మాట్లాడుతూ, గత జిల్లా అధ్యక్షుడు స్వర్గీయ పి. రవీంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి స్వర్గీయ నబీ రసూల్, కోశాధికారి స్వర్గీయ సుబ్రహ్మణ్యం ఒకే సంవత్సరంలో పరమపదించిన నేపథ్యంలో జిల్లా సమాఖ్యకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ, వినియోగదారుల్లో అవగాహన పెంపు, జిల్లా స్థాయిలో వినియోగదారుల సంఘాల బలోపేతమే సమాఖ్య ప్రధాన లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో వినియోగదారుల సంఘాలను మరింత పటిష్టం చేసేందుకు క్యాప్కో కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడు: తోట చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి: ఆర్. శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్: చల్లా కిషోర్ కుమార్, ఉపాధ్యక్షులు: పి. కృష్ణమూర్తి, చంద్ర మహేష్, శ్రాయల్ కొండయ్య, కోశాధికారి: శేషాద్రి, జాయింట్ సెక్రటరీ (మహిళ): హసీన్ వలి, సంయుక్త కార్యదర్శి: అశ్వత్ రెడ్డి, అదేవిధంగా, వివిధ మండలా లకు చెందిన ప్రతినిధులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో పలువురు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## ఘనంగా త్రియాంష్ రాయల్ పుట్టినరోజు వేడుకలు

**- ఉపాధ్యాయులు ప్రసాద్ మనుమడు త్రియాంష్ రాయల్ జన్మదిన సంబరాలు**






**అనంతపురంటౌన్– సూర్యవాస్తవం:** ఉపాధ్యాయులు ప్రసాద్ మనుమడు త్రియాంష్ రాయల్ పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రియాంష్ రాయల్‌తో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. త్రియాంష్ రాయల్ ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఎదిగి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. పుట్టినరోజు సందర్భంగా పలువురు చిన్నారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొని త్రియాంష్ రాయల్‌ను ఆశీర్వదించారు. జన్మదిన వేడుకలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగాయి.

# 15 ఏళ్లుగా తీరని కలగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ

**- అనంత నగరానికి తప్పని పారిశుద్ధ్య కష్టాలు**
**- మూడు ప్రభుత్వాలు మారినా పరిష్కారం కాని మురుగు**
**- రూ.750 కోట్లతో భూగర్భ డ్రైనేజీ ప్రతిపాదనలు.. ఆమోదం కోసం ఎదురుచూపులు**
**- దుర్వాసన, దోమలు, వ్యాధుల భయంతో నిత్యం ఇబ్బందులు పడుతున్న నగరవాసులు**
**- ఇంకో పక్క ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి ముప్పు**
**- విచక్షణా రహిత వినియోగంతో పెరుగుతున్న కాలుష్యం**
**- గుడ్డ సంచుల వినియోగానికి ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలి**





**అనంతపురం కార్పొరేషన్ – సూర్య వాస్తవం :** నగరంలో దాదాపు నాలుగు లక్షల మంది ప్రజలు గత 15 ఏళ్లుగా పారిశుద్ధ్య సమస్యలతో నిత్యం పోరాడుతున్నారు. మూడు ప్రభుత్వాలు మారినా నగరవాసుల కష్టాలు మాత్రం మారలేదు. రాజకీయ నాయకుల మధ్య సవాళ్లు, విమర్శలు, సాంకేతిక చిక్కులు అంటూ కాలం గడు స్తున్నప్పటికీ, సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు ముందుకు సాగలేదు. నగరంలోని అనేక కాలనీల్లో మురుగు నీటి పారుదల సమస్య తీవ్రంగా మారింది. మురుగు ప్రవాహాలు, దుర్వాసన, దోమల బెడద, సీజనల్ వ్యాధుల భయం నగరవాసులను వెంటాడుతున్నాయి. పారిశుద్ధ్య సమస్యలు నగరాన్ని సమస్యల వలయంలోకి నెట్టుతు న్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఏకైక నగరపాలక సంస్థ. అయినప్పటికీ, నగరంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) వ్యవస్థ ఏర్పాటు గత 15 ఏళ్లుగా కలగానే మిగిలిపోయింది. ప్రతి ఎన్నికల్లోనూ యూజీడీ నిర్మాణం ప్రధాన హామీగా మారుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించడం లేదు. మురుగు నీటి పారుదల సమస్య ప్రతి కాలనీకి గండంగా మారినా, వరుస ప్రభుత్వాలు ఈ అంశంపై తగిన చొరవ చూపలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పుట్టపర్తి, తాడిపత్రి పట్టణాల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సాకారమైంది. అయితే, ఉమ్మడి జిల్లాలో ప్రధాన నగరమైన అనంతపురంలో మాత్రం యూజీడీ నిర్మాణం దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితమవడం గమనార్హం.

**రూ.750 కోట్లతో ప్రతిపాదనలు**

అనంతపురం నగరంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి 2025 మార్చి 14న ప్రతిపాదనలు పంపారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ కోరడంతో ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. యూజీడీ నిర్మాణానికి సుమారు రూ.750 కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆమోదం కోసం నగరపాలక అధికారులు, ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే, ప్రతిపాదనలు పంపిన తర్వాత కూడా పనులు ప్రారంభమయ్యే దిశగా స్పష్టమైన పురోగతి కనిపించకపోవడం నగరవాసుల్లో ఆందోళన కలిగిస్తోంది.

**తాడిపత్రిలో 18 ఏళ్ల క్రితమే పూర్తి**

తాడిపత్రి పట్టణంలో భూగర్భ మురుగు వ్యవస్థ 18 ఏళ్ల క్రితమే సాకారమైంది. 2005లో ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.28.41 కోట్లతో 161.18 కిలోమీటర్ల మేర యూజీడీ నిర్మాణ పనులు చేపట్టే బాధ్యతలు అప్పగించారు. 2008 డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేశారు. అనంతరం రెండేళ్లపాటు అదే సంస్థ నిర్వహణ బాధ్యతలు నిర్వహించి, 2010లో పురపాలక సంస్థకు అప్పగించింది. అయితే, అనంతపురం నగరంలో మాత్రం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఇప్పటికీ కలగానే మిగిలిపోయింది. నగరంలో భవిష్యత్ జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని యూజీడీ ప్రణాళిక రూపొందించారు. 2056 నాటికి 5.50 లక్షల జనాభాకు అనుగుణంగా మురుగు నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

నగరంతోపాటు అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అనంతగ్రామీణ, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, నారాయణపురం పంచాయతీల సమీప ప్రాంతాలను కూడా యూజీడీ ప్రణాళికలో పరిగణనలోకి తీసుకున్నారు. పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకుని భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను త్వరితగతిన అమలు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

**ప్లాస్టిక్ కవర్లతో పర్యావరణానికి ముప్పు**

మన రోజువారీ అవసరాలకు ప్లాస్టిక్ కవర్ల వినియోగం పెరగడం వల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. ఉపయోగించిన ప్లాస్టిక్ కవర్లను రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పారేయడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ప్లాస్టిక్ కవర్లు డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. దీంతో రహదారులపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ కవర్లు భూమిలో త్వరగా కరగకపోవడంతో నేల నాణ్యత దెబ్బతింటోంది. చెత్త కుప్పల్లో ఉన్న ప్లాస్టిక్‌ను పశువులు ఆహారంగా భావించి తినడం వల్ల వాటి ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడుతోంది. చెరువులు, నదులు వంటి నీటి వనరుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు చేరడం వల్ల జలచరాల జీవనానికి కూడా ముప్పు ఏర్పడుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల విషపూరిత పొగ వెలువడి వాయు కాలుష్యం పెరుగుతోంది. ఈ పొగ మానవ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చిన్న కణాలుగా మారి నేల, నీరు, ఆహార గొలుసులో కలిసే ప్రమాదం కూడా ఉందని పేర్కొంటున్నారు

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, పునర్వినియోగ సంచులను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు, పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. అనంతపురంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు దుకాణలలో అమ్ముతుంటే ఎంత మంది సోషల్ మీడియా ద్వారా న్యూస్ పేపర్స్, ద్వారా వీడియో రూపంలో న్యూస్ ఆర్టికల్స్ కానీ ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న విషయాన్ని బయట పెట్టినా మున్సిపాలిటీ అధికారులు కానీ సంభందించిన అధికారులు కానీ ఎవరు క్షేత్రస్థాయి పర్యటన కానీ ఎవరి పైన చర్యలు తీసుకున్నట్లుగా ఎక్కడ కనిపించలేదు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగంపై నియంత్రణ చర్యలు మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.






# రోడ్డు భద్రతే ధ్యేయం..

**- అనంత జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు**
**- ముమ్మరంగా వాహనాల తనిఖీ చేసిన పోలీసులు**
**- నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు: జిల్లా ఎస్పీ పి. జగదీష్**
**- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచన**



**అనంతపురం క్రైమ్– సూర్య వాస్తవం:** జిల్లాలో రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. వాహనదారుల్లో ట్రాఫిక్ క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం జిల్లావ్యాప్తంగా విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనదారులు, ప్రయాణికులకు సురక్షిత ప్రయాణానికి సంబంధించిన పలు సూచనలు చేశారు.

**హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాణాధారం**

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని పోలీసులు సూచించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడటం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**



ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై జరిమానాలతో పాటు అవసరమైన మేరకు కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణతో రోడ్డు నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించగలమని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ రక్షణ, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి, సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సూర్య వాస్తవం ద్వారా ప్రతి ఒక్కరికీ చిన్న విన్నపం
వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించండి.
వేగం కంటే ప్రాణ భద్రతే ముఖ్యమని గుర్తుంచుకోండి.
మీ కుటుంబం , మీ కోసం ఇంటి దగ్గర ఎదురుచూస్తూ ఉంటుందని
గుర్తుంచుకోండి
సురక్షిత ప్రయాణం -- సంతోషకరమైన కుటుంబం
హెల్మెట్ ధరించండి... సీట్‌బెల్ట్ పెట్టుకోండి... ప్రాణాలను కాపాడుకోండి.

# రూ.కోట్ల వైద్య పరికరాలు మూలకు..

- వైద్యుల నిర్లక్ష్యం కోట్ల రూపాయలు ప్రజాధనం వృథా..!
- వైద్యుల కొరత, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా యంత్రాలు
- అనంతపురం సూపర్ స్పెషాల్టీలో వినియోగానికి నోచుకొని రూ.55 లక్షల వీడియో ఎండోస్కోపీ పరికరం
- తాడిపత్రిలో మూలకు పడిన ఎక్స్‌రే యంత్రం..
- ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లిలో ఎండకు వదిలేసిన ఆక్సిజన్ ప్లాంట్లు
- ప్రైవేటు ఆసుపత్రుల వైపు పరుగులు





**అనంతపురం వైద్యం- సూర్య వాస్తవం :** ప్రజల ప్రాణాలను కాపాడే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నప్పుడే సమాజం ఆరోగ్యంగా, సురక్షితంగా ఉంటుంది. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో లక్షలు, కోట్ల రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన కీలక వైద్య పరికరాల వినియోగం, నిర్వహణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకవైపు సరైన వైద్య సేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు విలువైన వైద్య పరికరాలు వినియోగానికి నోచుకోకుండా మూలన పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.వైద్యుల కొరత, సాంకేతిక సిబ్బంది లేకపోవడం, సరైన నిర్వహణ చేపట్టకపోవడం వంటి కారణాలతో పలు పరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన పరికరాలు ఉన్నప్పటికీ వాటి ద్వారా సేవలు అందకపోవడంతో పేద రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**రూ.55 లక్షల పరికరం నిరుపయోగం**

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అనంతపురం సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రిలోని మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి ప్రభుత్వం రూ.55 లక్షల విలువైన వీడియో ఎండోస్కోపీ యంత్రాన్ని కేటాయించింది.అయితే ఆ విభాగానికి అవసరమైన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో మూడేళ్లకు పైగా సేవలు ప్రారంభానికి నోచుకోలేదని సమాచారం. దీంతో లక్షల రూపాయల విలువైన పరికరం వినియోగం లేక నిరుపయోగంగా మారింది.ఈ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొస్తే కడుపులో అల్సర్లు, పుండ్లు, జీర్ణాశయ సంబంధిత సమస్యలను సకాలంలో గుర్తించి చికిత్స అందించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇదే పరీక్షలను ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోవాలంటే ఒక్కో రోగి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.ప్రభుత్వ ఆసుపత్రిలో పరికరం అందుబాటులో ఉన్నప్పటికీ సేవలు లేకపోవడంతో పేద రోగులు ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తాడిపత్రిలో మూలకు పడిన ఎక్స్‌రే యంత్రం**

తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఎక్స్‌రే యంత్రం ప్రస్తుతం వినియోగానికి నోచుకోకుండా మూలకు పడిపోయినట్లు సమాచారం. కొత్త యంత్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత పాత యంత్రాన్ని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురాకుండా నాలుగేళ్లుగా పక్కన పెట్టినట్లు తెలుస్తోంది.ఆసుపత్రిలో ప్రతిరోజూ 150 మందికిపైగా రోగులకు ఎక్స్‌రే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఒకే యంత్రంపై అధిక భారం పడటంతో రోగులు గంటల తరబడి క్యూలలో వేచి ఉండాల్సి వస్తోంది.మూలకు పడిన యంత్రాన్ని మరమ్మతు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకొస్తే రోగుల నిరీక్షణ సమయం తగ్గడంతో పాటు ఎక్స్‌రే సేవలు మరింత వేగంగా అందే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**ఎండలో ఆక్సిజన్ ప్లాంట్లు.. అత్యవసర వేళ సిలిండర్లే దిక్కు**

ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యం పరాకాష్ఠకు చేరిందనే ఆరోపణలు ఉన్నాయి. కొవిడ్ కేసులు పెరిగిన సమయంలో 2022లో దాతలు సుమారు రూ.80 లక్షలు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్లను అందించారు.అయితే వాటికి సరైన సంరక్షణ కల్పించకుండా బయట ఎండలోనే ఉంచడంతో పరికరాలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఆక్సిజన్ అందించేందుకు ప్రస్తుతం సిలిండర్లపైనే ఆధారపడాల్సి వస్తోందని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.ఈ రెండు ఆసుపత్రులకు ప్రతిరోజూ సుమారు 300 మంది రోగులు వివిధ రకాల చికిత్సల కోసం వస్తున్నారు. రెండు ఆసుపత్రుల్లో కలిపి సుమారు 30 పడకలు ఉన్నప్పటికీ, అత్యవసర సమయంలో అవసరమైన ప్రాణవాయువు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఆక్సిజన్ ప్లాంట్లకు సంబంధించిన సెన్సార్ వ్యవస్థలు, ఎలక్ట్రికల్ బోర్డులు ఇప్పటికే దెబ్బతిన్నాయని సమాచారం. ప్లాంట్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి సుమారు రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్య వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలంటున్న ప్రజలు**

ప్రజల ఆరోగ్యం, ప్రాణాలకు సంబంధించిన కీలక వైద్య పరికరాలు నిరుపయోగంగా మారకుండా తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవసరమైన వైద్యులు, సాంకేతిక సిబ్బందిని నియమించి, అందుబాటులో ఉన్న పరికరాల ద్వారా వైద్య సేవలను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.కోట్ల రూపాయల ప్రజాధనం వృథా కాకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్య పరికరాల నిర్వహణ, వినియోగంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ బడుల మౌలిక వసతులకు

# రూ.534.8 కోట్ల అవసరం

- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 27,520 మౌలిక వసతుల అవసరాల గుర్తింపు
- ప్రహరీ గోడలు, అదనపు గదులు, శౌచాలయాలకు భారీగా నిధుల అవసరం
- 'డోనర్' యాప్‌లో పాఠశాలల అవసరాలు, అంచనా వ్యయాల నమోదు
- పూర్వ విద్యార్థులు, ప్రవాసాంధ్రులు, దాతలు ముందుకు రావాలని విద్యాశాఖ పిలుపు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల అభివృద్ధే లక్ష్యం



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్తగా తీసుకొచ్చిన 'డోనర్' మొబైల్ యాప్ జిల్లాలోని ప్రభుత్వ బడుల మౌలిక వసతుల పరిస్థితిని తేటతెల్లం చేసింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సాంకేతిక విద్యా వనరుల సమీకరణకు ఏకంగా రూ.534.8 కోట్ల నిధులు అవసరమని యాప్‌లో నమోదైన వివరాల ద్వారా వెల్లడైంది. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల వారీగా మొత్తం 27,520 అవసరాలను 'డోనర్' యాప్‌లో నమోదు చేశారు. పాఠశాలల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలను గుర్తించి, వాటి కోసం అవసరమయ్యే అంచనా వ్యయాన్ని కూడా నమోదు చేశారు.జిల్లాలో ఏకంగా 461 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవు. వీటి నిర్మాణానికి సుమారు రూ.64 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రాథమిక పాఠశాలల్లో 311 అదనపు గదులు, ఉన్నత పాఠశాలల్లో 113 తరగతి గదుల నిర్మాణానికి రూ.126 కోట్లకు పైగా నిధులు అవసరమవుతున్నాయి.

అలాగే, 326 పాఠశాలల్లో కొత్త శౌచాలయాల నిర్మాణం, అసంపూర్తిగా ఉన్న పనుల పూర్తి కోసం రూ.31.49 కోట్లు వెచ్చించాల్సి ఉంది. 153 సైన్స్ ల్యాబ్‌లు, 155 గ్రంథాలయ గదుల ఏర్పాటుకు రూ.63.6 కోట్లు అవసరమని గుర్తించారు.కంప్యూటర్ విద్యను మరింత విస్తరించేందుకు 144 పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.26.6 కోట్లు కావాల్సి ఉంది. 351 ప్రాంతాల్లో మధ్యాహ్న భోజన గదుల నిర్మాణానికి రూ.23.48 కోట్లు, 423 చోట్ల డ్యూయల్ డెస్క్ బెంచీల ఏర్పాటుకు రూ.15.52 కోట్లు అవసరమని యాప్‌లో నమోదు చేశారు.అదేవిధంగా, 297 పాఠశాలలకు డెస్క్‌టాప్ కంప్యూటర్లు సమకూర్చేందుకు రూ.3.25 కోట్లు, విద్యుత్ అంతరాయాల సమయంలో సౌకర్యం కోసం ఇన్వర్టర్ల ఏర్పాటుకు రూ.98 లక్షలు అవసరమని అంచనా వేశారు.గతంలో ప్రభుత్వ పాఠశాలలకు విరాళాలు అందించాలనుకునే దాతలకు సరైన వేదిక లేకపోయేది. ప్రస్తుతం 'డోనర్' యాప్ ద్వారా దాతలు ఎక్కడ ఉన్నా తమ స్వగ్రామంలోని పాఠశాలల పరిస్థితిని నేరుగా మొబైల్ ఫోన్‌లోనే తెలుసుకునే అవకాశం కల్పించారు.నగదు విరాళాలతో పాటు గ్రీన్‌బోర్డులు, బెంచీలు, ఫ్యాన్లు, కంప్యూటర్లు వంటి అవసరమైన వస్తువులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసి, తాము ఎంచుకున్న పాఠశాలకు నేరుగా పంపేలా ప్రభుత్వం పారదర్శక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, ప్రవాసాంధ్రులు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని విద్యాశాఖ కోరుతోంది.




## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు పోలీసుల హెచ్చరిక
- గ్రామసభల్లో మహిళల భద్రత, సైబర్ నేరాలు, గంజాయి నియంత్రణపై అవగాహన
- మహిళలు శక్తి యాప్, స్త్రీరక్ష పోర్టల్ సేవలు వినియోగించుకోవాలని సూచన



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన గ్రామసభల్లో పోలీసులు ప్రజలకు మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణ, గంజాయి నిర్మూలన, రహదారి భద్రత తదితర అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్, స్త్రీరక్ష పోర్టల్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరగాళ్ల మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు వెల్లడించవద్దని అవగాహన కల్పించారు. అలాగే అక్రమ మద్యం, గుట్కా, మట్కా, పేకాట, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల నియంత్రణ, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమ వుతుందని పోలీసులు తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులపై బూతుల పర్వం

- దొరవారిసత్రంలో సవాల్‌గా మారిన వైసిపి నేతల దౌర్జన్యాలు!
- కూటమి ప్రభుత్వం వచ్చినా మారని"ఫ్యాన్"పార్టీ నాయకుల తీరు
- విద్యుత్ కనెక్షన్ ఇచ్చారనే కోపంతో ఏఈ, లైన్‌మ్యాన్‌పై అసభ్యకరంగా విరుచుకుపడ్డ వైసీపీ నేత
- ఏనాది కాలనీ అంటూ ఎస్టీ ఏనాది వారిని కించపరిచిన వైనం
- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆడియో... చర్యలకు జనం డిమాండ్!



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** "రాష్ట్రంలో ప్రభుత్వం మారింది...పాలకులు మారారు...కానీ దొరవారిసత్రం మండలంలో వైసీపీ నాయకుల అహంకారం,దౌర్జన్య పూరిత వైఖరి మాత్రం రవ్వంతైనా మారలేదు"అనే విమర్శలు ఇప్పుడు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ బద్ధంగా విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని,వారిపై అసభ్యకరమైన పదజాలంతో విరుచుకుపడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా పూలతోట గ్రామంలో చోటు చేసుకున్న సంఘటన, వైసీపీ నేతల అరాచక పాలనకు, వారి బూతుల సంస్కృతికి మరోసారి నిదర్శనంగా నిలిచింది. ?అసలు ఏం జరిగింది? పూలతోట గ్రామానికి చెందిన ఒక కూటమి కార్యకర్త ఇంటికి,పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుండి విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం కనెక్షన్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు వెళ్లారు. తమ విధుల్లో భాగంగా ప్రజలకు సేవలందించిన విద్యుత్ శాఖ ఏఈ స్థానిక పూలతోట లైన్‌మ్యాన్‌లపై అదే గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు విరుచుకుపడ్డాడు.?"ఒక కూటమి కార్యకర్త ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఎలా ఇస్తారు?" అని ప్రశ్నిస్తూ, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ఏమాత్రం గౌరవించకుండా, ఆ ఉద్యోగులను నోటికొచ్చినట్లు, వినడానికి కూడా అసహ్యంగా ఉండే బూతులు తిడుతూ దుర్భాషలాడాడు.

రాజ్యాంగబద్ధంగా పనిచేసే ఒక ప్రభుత్వ ఉద్యోగిపై ఈ స్థాయిలో విరుచుకుపడటం చట్టరీత్యా తీవ్రమైన నేరం. విద్యుత్ శాఖ అధికారులను బెదిరిస్తూ మాట్లాడిన ఈ వ్యవహారానికి సంబంధించిన ఆడియో రికార్డింగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ఆడియో విన్న ప్రతి ఒక్కరూ ఆ నాయకుని తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ?అసలు మండలంలో అధికారంలో ఉన్నది ఎవరు? ?ప్రస్తుతం స్థానిక ప్రజల నుంచి వస్తున్న ప్రధాన ప్రశ్న ఒక్కటే "దొరవారిసత్రం మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందా? లేక ఇంకా వైసీపీ దౌర్జన్యాల పాలనే నడుస్తోందా?" రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా కూటమి ప్రభుత్వం కొలువుదీరినా,దొరవారిసత్రం మండలంలో మాత్రం కూటమి నాయకులు మెతక వైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ"మెతక వైఖరి"ని ఆసరాగా చేసుకునే వైసీపీ నాయకులు,కార్యకర్తలు మరింత రెచ్చిపోతున్నారని, కూటమి కార్యకర్తలను హింసిస్తూ, ప్రభుత్వ అధికారులపై సైతం భౌతిక, మానసిక దాడులకు తెగబడుతున్నారని స్థానికులు వాపోతున్నారు.కఠిన చర్యలు తీసుకోవాల్సిందే!

వైసీపీ అంటేనే "దౌర్జన్యం, బెదిరింపులు, బూతులు, గొడ్డలి సంస్కృతి" అని పూలతోట ఘటనతో ఆ పార్టీ నేతలు మరోసారి నిరూపించుకున్నారని ప్రజలు మండిపడుతున్నారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన ఆ వైసీపీ నాయకుడిపై చట్టపరంగా తీవ్రమైన చర్యలు తీసుకోవాలని,కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దొరవారిసత్రం మండల ప్రజలు,ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని మరియు పోలీసు శాఖను డిమాండ్ చేస్తున్నాయి.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యోగులు రక్షణ లేక భయభ్రాంతులకు గురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## తిరుపతి జిల్లా వ్యాప్తంగా

# డ్రగ్స్ నిర్మూలనకు పోలీసుల ప్రత్యేక చర్యలు

- దామినేడు, మనేకూరులో ర్యాపిడ్ డ్రగ్ (క్యానబినాయిడ్స్) పరీక్షలు
- పిచ్చాటూరులో మాదకద్రవ్యాల నివారణ, మహిళల భద్రతపై అవగాహన




**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దామినేడు ప్రాంతంలో సీఐ మరియు పోలీసు సిబ్బంది ర్యాపిడ్ డ్రగ్ (క్యానబినాయిడ్స్) పరీక్షలు నిర్వహించారు. అనుమానితులపై పరీక్షలు నిర్వహించి, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర తనిఖీలు కొనసాగిస్తున్నారు. అదే విధంగా పిచ్చాటూరు ప్రాంతంలో మాదకద్రవ్యాల దుష్పరిణామాలు,మహిళలపై జరిగే నేరాల నివారణ,మహిళల భద్రత,సైబర్ నేరాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పోలీసులు వివరించారు.అలాగే నాయుడుపేట పోలీస్



స్టేషన్ పరిధిలోని మనేకూరు ఎన్‌టీఆర్ కాలనీలో వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన 14 మంది కార్మికులకు ర్యాపిడ్ డ్రగ్ (క్యానబినాయిడ్స్) పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని నాయుడుపేట ఎస్ఐ శ్రీ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్. మాట్లాడుతూ,మాదకద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.డ్రగ్స్ వినియోగం,విక్రయం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించాలని కోరారు.డ్రగ్స్ రహిత తిరుపతి జిల్లాను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# వడివడిగా హైకోర్టు బెంచ్ ఏర్పాట్లు

**కర్నూలు– సూర్య వాస్తవం :** రాయలసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి ఆకాంక్ష అయిన కర్నూలులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చేసిన ప్రకటన తీవ్ర ఆసక్తికరమైన చర్చకు తెరలేపింది. 90 రోజుల్లో కర్నూలులో హైకోర్టు బెంచ్ అందుబాటులోకి వస్తుందని ఆయన ప్రకటించారు. అయితే, ఒక రాష్ట్రంలో లేదా ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలోని అంశం మాత్రమే కాదు. దీనికి సుదీర్ఘమైన రాజ్యాంగపరమైన, న్యాయపరమైన, పరిపాలనాపరమైన ప్రక్రియలు అవసరమవుతాయి. అందుకే 90 రోజుల గడువు సాధ్యమేనా? అసలు బెంచ్ ఏర్పాటు వెనుక ఉండే చట్టపరమైన క్రమం ఏమిటి? సాధారణంగా ఏదైనా రాష్ట్రంలో హైకోర్టుకు చెందిన ఒక ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేయాలంటే ది స్టేట్ హైకోర్ట్స్ యాక్ట్ లేదా సంబంధిత పునర్వ్యవస్థీకరణ చట్టాల నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను మొదట రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించాలి. అనంతరం, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సమక్షంలోని ఫుల్ కోర్ట్ ముందుకు ఈ ప్రతిపాదన వెళుతుంది. హైకోర్టు ఫుల్ కోర్ట్ ఈ బెంచ్ ఏర్పాటుకు సాంకేతిక, మౌలిక వసతుల సాధ్యాసాధ్యాలను పరిశీలించి పూర్తి స్థాయిలో ఆమోదం తెలపాల్సి ఉంటుంది.హైకోర్టు ఫుల్ కోర్ట్ అంగీకారం తెలిపిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రతిపాదనను కేంద్ర న్యాయ శాఖ కు నివేదిస్తుంది. కేంద్ర ప్రభుత్వం దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు కొలీజియం పరిశీలనకు పంపుతుంది. సుప్రీంకోర్టు సీజేఐ , కొలీజియం నుండి అనుమతి లభించిన తర్వాత మాత్రమే, కేంద్ర హోంశాఖ భారత రాష్ట్రపతి ఆమోదం కోసం ఫైలును పంపుతుంది. భారత రాజ్యాంగంలోని అధికరణ 214, సంబంధిత నిబంధనల ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాతే కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చట్టబద్ధంగా రూపుదిదు కుంటుంది రాజ్యాంగపరమైన ఈ ప్రక్రియతో పాటు క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పన అత్యంత ప్రధానమైనది. బెంచ్ నిర్వహణకు అవసరమైన తాత్కాలిక లేదా శాశ్వత భవనాలు, న్యాయమూర్తులకు నివాస సదుపాయాలు , కోర్టు హాళ్లు, రిజిస్ట్రీ సెక్షన్లు, అడ్వకేట్ రూమ్‌లు, పోలీస్ బందోబస్తు , డిజిటల్ నెట్‌వర్కింగ్ వంటి మౌలిక వసతులను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేయాలి. వీటితో పాటు అమరావతిలోని ప్రధాన హైకోర్టు నుండి కర్నూలు బెంచ్‌కు ఏ ఏ జిల్లాల కేసుల అధికార పరిధి బదిలీ చేయాలనే దానిపై న్యాయ పరిపాలనా పరమైన స్పష్టత రావాల్సి ఉంటుందిఇంతటి సుదీర్ఘ ప్రక్రియ ఉన్నప్పటికీ మంత్రి నారా లోకేష్ 90 రోజుల గడువు విధించడం వెనుక కూటమి ప్రభుత్వ వ్యూహాత్మక ఆలోచన ఉందని రాజకీయ, న్యాయ విశ్లేషకులు భావిస్తున్నారు. కర్నూలులో



ఇప్పటికే లోకాయుక్త వంటి న్యాయ సంస్థలకు ఉద్దేశించిన భవనాలు సిద్ధంగా ఉన్నందున, ప్రాథమికంగా తాత్కాలిక భవనంలో బెంచ్ కార్యకలాపాలు ప్రారంభించే వెసులుబాటును ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రంతో మంచి సఖ్యతతో ఉన్నందున, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం త్వరితగతిన పూర్తి చేసి, సుప్రీంకోర్టు, హైకోర్టు సీజేల అనుమతుల ప్రక్రియను ఫాస్ట్ ట్రాక్ చేయాలనేది లోకేష్ వేసిన కచ్చితమైన ముందస్తు ప్రణాళికగా కనిపిస్తోంది.గతంలో బెంచ్ ఏర్పాటు ప్రక్రియలపై న్యాయవాదుల నిరసనలు, వినతులు జాప్యానికి కారణమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల, 90 రోజుల్లో అన్ని రాజ్యాంగ ఆమోదాలు, రాష్ట్రపతి ఉత్తర్వులు పొందడం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం గట్టి పట్టుదలతో పరిపాలనాపరమైన క్లియరెన్సులను వేగవంతం చేస్తే, నిర్ణీత సమయంలో లేదా దానికి సమీప కాలంలో కర్నూలులో హైకోర్టు బెంచ్‌కల సాకారమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

# భువనేశ్వరి ఆగ్రహం...



**తిరుపతి–సూర్య వాస్తవం :**నారా భువనేశ్వరి గత మూడు రోజుల నుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే నారా భువనేశ్వరి ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడరు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు దాదాపు నాలుగు సార్లు ఎన్నికయినప్పటికీ నారా భువనేశ్వరి పాలన వ్యవహారాల్లోనూ, రాజకీయాల్లోనూ ఆమె జోక్యం కనపడదు. కేవలం కుటుంబ బాధ్యతలతో పాటు తాను నిర్వహిస్తున్న హెరిటేజ్ వంటి పరిశ్రమలకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే చూస్తున్నారు. నారా భువనేశ్వరి పక్కా బిజినెస్ ఉమెన్. అయితే ఎన్నికల సమయంలో మాత్రం కేవలం కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తారు. అంతే తప్ప ఎటువంటి రాజకీయ వ్యవహారాలను నారా భువనేశ్వరి పట్టించుకోరు... నారా భువనేశ్వరిలో కోపం కనిపించదు. మృదుస్వభావి. అందరినీ నవ్వుతూ పలకరిస్తారు. అమ్మగా ఆమెను ఆప్యాయతను పంచుతారు. అలా చంద్రబాబుతో సమానంగా కుప్పం నియోజకవర్గ ప్రజలకు చేరువయ్యారు. నారా భువనేశ్వరి మాత్రమే కాదు లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా రాజకీయాలను అస్సలు పట్టించుకోరు. వారు కుటుంబం, వ్యాపారాలకే పరిమితమై హైదరాబాద్ లోనే ఉంటున్నారు. అలాంటి నారా భువనేశ్వరి కి కోపం వచ్చింది. ఒక్కసారిగా ఆవేదన ఉప్పొంగింది. కుప్పం నియోజకవర్గం పర్యటనలో ద్రౌపది చిత్రపటాన్ని చూసి నారా భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు. కుప్పం పర్యటనలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నారా భువనేశ్వరి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనను అసెంబ్లీలో అవమానించారని... అసెంబ్లీలో తనను నిండు సభలో అవమానించారని, ఆ సంఘటన మహాభారతంలో ద్రౌపది వస్త్రాపహరణాన్ని తలపించిందని కంటతడి పెట్టుకున్నారు. కౌరవులు సభలో ద్రౌపదిని అవమానించినట్టుగానే, గత పాలకులు రాజకీయ లబ్ధి కోసం తన చరితను హేళన చేశారని మండిపడ్డారు. తన భర్తకు తానేంటో తెలుసునని, తన భర్త చంద్రబాబుకు బాగా తెలుసునని , ఏ మహిళపై వ్యక్తిగత విమర్శలు చేసే హక్కు ఎవరికీ లేదని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. రాజకీయాల్లో పోరాటాలు ఎవరిపై చేయాలన్నా చేసుకోవచ్చు కానీ, ఇళ్లలోని స్త్రీలను లాగి అవమానించడం అత్యంత హేయమని ఆవేదన వెలిబుచ్చారు. మగ అహంకారంతో గత ప్రభుత్వంలో వ్యవహరించి తనను హేళన చేయడాన్ని ఆమె గుర్తు చేసుకుని బాధపడ్డారు. ఇది రాజకీయంగా హాట్ టాపిక్ గా మారింది.

# వీర మహిళలకు పెద్ద పీట....




**కాకినాడ –సూర్య వాస్తవం :**జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

VEERA MAHILA
THE WOMEN WING OF JANASENA PARTY



## జై కృష్ణ హీరోగా సక్సెస్ అయ్యాడు




సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' తో హీరోగా పరిచయం అయ్యారు. అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. వైజయంతి మూవీస్ బ్యానర్ పై అశ్విని దత్ సమర్పించారు. నిర్మాత పి. కిరణ్ నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో ఘన విజయం అందుకుని, సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా ఘట్టమనేని ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ,'సినిమా చూసి బయటికి వచ్చిన వారందరూ జై కృష్ణ అద్భుతంగా చేశాడని చెబుతున్నారు. యాక్షన్, పాటలు, డ్యాన్స్‌లు, ముఖ్యంగా డైలాగ్ డెలివరీ అన్నీ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసిస్తున్నారు. ఈ సినిమాతో జై కృష్ణ హీరోగా సక్సెస్ అయ్యాడు. తాత, బాబాయి, నాన్న లెగసీని కొనసాగించే వ్యక్తిగా జై కృష్ణ ఎదగాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'నా తొలి సినిమాకు, నా పెర్ఫార్మెన్స్‌కు ప్రేక్షకులు ఇస్తున్న ఆదరణకు థ్యాంక్యూ సో మచ్. చాలా ఆనందంగా ఉంది. ఘట్టమనేని అభిమానులందరికీ ధన్యవాదాలు. మీ నమ్మకాన్ని వంద శాతం మంచి సినిమాలతో నిలబెడతాను. బాబాయ్ మహేష్ బాబు సినిమా చూసి నేను చాలా బాగా పెర్ఫార్మ్ చేశానని చెప్పడం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది' అని హీరో జై కృష్ణ చెప్పారు. నిర్మాత కేవిఎస్ రామారావు మాట్లాడుతూ, 'ఈ సినిమా నేను చూశాను. చాలా అద్భుతంగా ఉంది. చాలా ఎమోషనల్‌గా అనిపించింది. జై కృష్ణ ఎక్స్‌ట్రా ఆర్డినరీగా పెర్ఫార్మ్ చేశాడు' అని తెలిపారు.

# జీరో సైజ్ ఉంటేనే హీరోయిన్లా?..

## నటి అంజలి ఆనంద్



బాడీ షేమింగ్ ఒక సామాజిక రుగ్మత అని వ్యాఖ్య "రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ" చిత్రంతో గుర్తింపు పొందిన నటి అంజలి ఆనంద్.. బాలీవుడ్‌లో నటీమణులు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై గళమెత్తారు. ప్రస్తుతం ధమాల్ 4 సినిమాలో నటించిన ఆమె చిత్ర పరిశ్రమలో అందానికి ఉన్న సంకుచిత నిర్వచనాలను సూటిగా నిలదీశారు. "బాలీవుడ్‌లో గ్లామర్ అంటే కేవలం 'జీరో సైజ్' శరీరాకృతి మాత్రమేనా? ఒక నటి ప్రతిభను కాకుండా, ఆమె రూపాన్ని బట్టి భవిష్యత్తును ఎందుకు అంచనా వేస్తున్నారు?" అని అంజలి ప్రశ్నించారు. తన నటన, కష్టం కంటే తన బరువు గురించే సమాజం ఎక్కువగా చర్చించడం బాధాకరమని, అయితే అటువంటి విమర్శలకు కుంగిపోకుండా తన ప్రతిభతోనే సమాధానం చెబుతానని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం కేవలం తన కోసమే కాదని, ఇటువంటి వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి అమ్మాయి కోసమని ఆమె పేర్కొన్నారు. సంప్రదాయ కథానాయికల రూపానికి భిన్నంగా ఉండే నటీమణులకు బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో పాత్రలు లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటీమణుల బాహ్య రూపాన్ని కాకుండా, వారి నైపుణ్యాలను, భావోద్వేగాలను వాడుకునేలా రచయితలు, దర్శకులు పాత్రలను సృష్టించాలని ఆమె కోరారు. 'ధమాల్ 4'లో తన పాత్ర, తాను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అంశానికి సంబంధించి ఉండటంతో, దానిని అంగీకరించే ముందు కొంత మానసిక సంఘర్షణకు లోనైనట్లు ఆమె వెల్లడించారు. 'ధమాల్ 4' ట్రైలర్ విడుదలైన తర్వాత ఎదురైన ట్రోలింగ్‌ను తాము ముందే ఊహించామని, దానికి మానసికంగా సిద్ధమయ్యామని అంజలి తెలిపారు. ట్రోల్స్‌ను పట్టించుకోకపోవడమే సరైన సమాధానమని, విమర్శలను ఎదుర్కోవడానికి తనకు ఎవరి ఓదార్పు అవసరం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బరువు, రంగు, దుస్తుల ఆధారంగా మనుషులను అంచనా వేయడం అనేది సమాజంలో వేళ్లూనుకున్న ఒక రుగ్మత అని, ఒక కళాకారిణిగా తన వృత్తి ద్వారా ఈ ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటానని ఆమె స్పష్టం చేశారు.

# 'శ్రీ శ్రీ' ఫారిన్ షెడ్యూల్ పూర్తి



హీరో దుల్కర్ సల్మాన్ ప్రస్తుతం నూతన దర్శకుడు రవి నెలకుదిటి దర్శకత్వంలో రూపొందుతున్న 'శ్రీ శ్రీ' లో నటిస్తున్నారు. ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్, నిర్మాణ సంస్థకు 10వ చిత్రం. ఇషాన్ సక్సేనా ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే తొలిసారి జంటగా నటిస్తున్న ఈ సినిమా ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇప్పటికే విడుదలైన వర్కింగ్ స్టిల్స్, ఫస్ట్ లుక్ పోస్టర్, తొలి పాట 'బొమ్మ బొమ్మ'కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫారిన్ షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లో సినిమాకు అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించారు. ముఖ్యంగా ఈ ఫారిన్ షెడ్యూల్‌లో తెరకెక్కించిన ఎపిసోడ్స్ సినిమాకు మేజర్ హైలైట్స్‌గా నిలవనున్నాయి. మేకర్స్ త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ చేయనున్నారు. పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న 'శ్రీ శ్రీ' తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# అభిషేక్ శర్మ వీర మాస్ కొట్టుడు..

## 25 సిక్సర్లతో ఊచకోత.. 91 బంతుల్లో 233 రన్స్

**పంజాబ్ ఇంటర్-డిస్ట్రిక్ట్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ డబుల్ సెంచరీ**
**కేవలం 91 బంతుల్లోనే 233 పరుగులు చేసిన యంగ్ ఓపెనర్**
**ఇన్నింగ్స్‌లో 25 సిక్సర్లు, 15 ఫోర్లు బాదిన వైనం**
**అంతర్జాతీయ క్రికెట్‌లో విఫలమవుతున్న నేపథ్యంలో ఈ ఇన్నింగ్స్**
**అభిషేక్ సునామీ ఇన్నింగ్స్ తో జట్టు స్కోరు 50 ఓవర్లలో 533/8**




టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తనపై వస్తున్న విమర్శలకు బ్యాట్‌తో గట్టి సమాధానం ఇచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో గత కొంతకాలంగా పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న అతను, దేశవాళీ వన్డే మ్యాచ్‌లో విధ్వంసకర డబుల్ సెంచరీతో చెలరేగాడు. పంజాబ్ ఇంటర్-డిస్ట్రిక్ట్ సీనియర్ టోర్నమెంట్‌లో అమృత్‌సర్ తరఫున ఆడిన అభిషేక్, కేవలం 91 బంతుల్లోనే 233 పరుగుల భారీ స్కోరు సాధించాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో ఏకంగా 25 సిక్సర్లు, 15 ఫోర్లు ఉండటం విశేషం. అభిషేక్ ధాటికి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. మ్యాచ్ లో అతడికి బౌలింగ్ చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి ఏర్పడింది. టార్న్ టరన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 256.04 స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. అతని అద్భుత బ్యాటింగ్ కారణంగా అమృత్‌సర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 533 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అభిషేక్ అసాధారణ ఇన్నింగ్స్‌కు సంబంధించిన స్కోర్‌కార్డు, బ్యాటింగ్ క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న వేళ.. ఇటీవలే ముగిసిన జింబాబ్వే పర్యటనలో అభిషేక్ శర్మ దారుణంగా విఫలమైన సంగతి తెలిసిందే. మూడు టీ20 మ్యాచ్‌లు ఆడి కేవలం 11 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. ముఖ్యంగా, మూడుసార్లూ ఒకే బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీ బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఈ సిరీస్‌లో అతని సగటు కేవలం 3.66 మాత్రమే. ఈ వైఫల్యం జింబాబ్వే సిరీస్‌కే పరిమితం కాలేదు. టీ20 ప్రపంచకప్‌కు ముందు దాదాపు 195 స్ట్రైక్ రేట్‌తో, 37 సగటుతో ఆడిన అభిషేక్.. ఆ తర్వాత గణనీయంగా పడిపోయాడు. అతని సగటు 19.4కి, స్ట్రైక్ రేట్ 165కి తగ్గింది. గత 10 అంతర్జాతీయ టీ20 ఇన్నింగ్స్‌లలో ఒక్క అర్ధసెంచరీ మాత్రమే నమోదు చేశాడు. దూకుడుగా ఆడాలో, నిలకడగా ఆడాలో తేల్చుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు అతని బ్యాటింగ్‌లో స్పష్టంగా కనిపించింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో, ఫామ్ కోల్పోయి ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న సమయంలో.. అభిషేక్ సాధించిన ఈ డబుల్ సెంచరీ అతనికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. తిరిగి తన పాత ఫామ్‌ను అందిపుచ్చుకోవడానికి,విమర్శకులకు దీటుగా బదులివ్వడానికి ఈ ఇన్నింగ్స్ దోహదపడుతుందని ఆశిస్తున్నారు.



# బుమ్రా లేకుండానే!

ముంబయి: శ్రీలంక పర్యటనకు ముందే టీమ్ ఇండియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గాయాలతో హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్ ఇప్పటికే దూరం కాగా.. తాజాగా పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా సైతం శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు అందుబాటులో ఉండటం లేదు. బెంగళూరులోని సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో బీసీసీఐ వైద్య బృందం బుమ్రాకు మరింత విశ్రాంతి అవసరమని సూచించారు. జులై 16న ఇంగ్లాండ్‌తో రెండో వన్డేలో జస్‌ప్రీత్ బుమ్రా మోకాలి గాయానికి గురైన సంగతి తెలిసిందే. ఇంపాక్ట్ ఇంజూరీ కావటంతో మూడో వన్డేకు విశ్రాంతి ఇస్తే సరిపోతుందని తొలుత భావించినా, తాజాగా గాయం తీవ్రతపై వైద్య బృందం ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం కావటంతో అతడి స్థానంలో మరో పేస్ బౌలర్‌ను జట్టులోకి తీసుకోవాల్సి వచ్చింది.

### నబికి అవకాశం?

గాయంతో జస్‌ప్రీత్ బుమ్రా టెస్టు సిరీస్‌కు దూరం కాగా.. అతడి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. దేశవాళీ సర్క్యూట్‌లో నిలకడగా రాణిస్తున్న జమ్మూ కశ్మీర్ పేసర్ అకిబ్ నబికి అవకాశం దక్కవచ్చనే అంచనాలు బలంగా వినిపిస్తున్నాయి. యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ సహా ముకేశ్ కుమార్, యశ్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్ పేర్లు సెలక్షన్ కమిటీ పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది.

### 4న కొలంబోకు పయనం

రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఈ నెల 4న భారత జట్టు శ్రీలంకకు బయల్దేరనుంది. ఆగస్టు 15న గాలెలో తొలి టెస్టు జరుగనుండగా.. 7 నుంచి కొలంబోలో టీమ్ ఇండియా వార్మప్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. ప్రాక్టీస్ మ్యాచ్‌ను తొలుత 4 రోజులకు షెడ్యూల్ చేసినా.. తాజాగా ఆ మ్యాచ్‌ను మూడు రోజులకు కుదించారు. 4న కొలంబోకు చేరుకోనున్న శుభ్‌మన్ గిల్ సేన అక్కడ 9 వరకు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. అక్కడ్నుంచి తొలి టెస్టు వేదిక గాలెకు వెళ్లనుంది. భారత్, శ్రీలంక టెస్టు సిరీస్ ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగం కావటంతో ఇరు జట్లు ఈ సిరీస్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉండగా, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతోంది.

# ఆసియాలో పునరావృతం చేస్తాం!

## బిఎఫ్ఐ ప్రెసిడెంట్ అజయ్ సింగ్

న్యూఢిల్లీ : గ్లాస్గో 2026 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత బాక్సర్లు పది పతకాలు సాధించటంపై బాక్సింగ్ సమాఖ్య (బిఎఫ్ఐ) అధ్యక్షుడు అజయ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఆసియా క్రీడల్లోనూ భారత బాక్సర్లు ఇదే పతక ప్రదర్శన పునరావృతం చేస్తారనే విశ్వాసం ఆయన వెలిబుచ్చారు. కామన్‌వెల్త్ క్రీడల్లో మన బాక్సర్లు ఏడు బంగారు పతకాలు, మూడు రజత పతకాలతో చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. 'గత రెండు రోజులు భారత బాక్సింగ్‌కు చరిత్రాత్మకం. గత 100 ఏండ్లలో కామన్‌వెల్త్ గేమ్స్‌లో ఏడు స్వర్ణాలు, మూడు రజతాలు సాధించటం అతిపెద్ద విజయం. ఆసియా క్రీడలతోపాటు 2028 ఒలింపిక్స్‌కు ఇది సన్నద్ధత. ఆసియా క్రీడల్లోనూ ఇదే తరహా పతక ప్రదర్శన పునరావృతం చేస్తాం. ఆసియా బాక్సింగ్‌లో భారత్ టాప్-3లో ఉంది. అగ్రస్థానంలోకి చేరుకునేందుకు మరింత కష్టపడాల్సి ఉంది. కామన్‌వెల్త్ క్రీడల్లో పతక పోరుకు చేరుకున్న బాక్సర్లు ఆసియా క్రీడలకు నేరుగా అర్హత సాధిస్తారని ఇదివరకే ప్రకటించాం. ఆసియా క్రీడల్లో బలమైన ప్రదర్శన కనబరిచేందుకు కొన్ని వెయిట్ విభాగాల్లో బలోపేతం కావాలి. అందుకు ఎంతో




పని చేయాల్సి ఉంది. కామన్‌వెల్త్ క్రీడల్లో చారిత్రక ప్రదర్శన అందులో ఒక అడుగు మాత్రమే. మాది అథ్లెట్ కేంద్రిక క్రీడా సమాఖ్య. 2028 వరకు బాక్సింగ్ రోడ్‌మ్యాప్ సిద్ధంగా ఉంది. దేశవాళీ సర్క్యూట్‌లో లీగ్ ఫార్మాట్, ప్రొఫెషనల్ ఫార్మాట్‌ను పున ప్రారంభించాలనే ఆలోచన ఉందని' అజయ్ సింగ్ తెలిపారు. భారత బాక్సర్లతో కలిసి అజయ్ సింగ్ ఆదివారం గ్లాస్గో నుంచి మీడియాతో మాట్లాడారు. కామన్‌వెల్త్ క్రీడలు ఆదివారంతో ముగియగా.. ముగింపు వేడుకలు అర్ధరాత్రి 1.30 తర్వాత ఆరంభం అవుతాయి.

# కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతాం

- తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ సమీక్షా సమావేశంలో డిసిసి అధ్యక్షుడు బాలగురువం బాబు పిలుపు
- మండల స్థాయి నాయకులకు త్వరలోనే రాజకీయ శిక్షణ తరగతులు
- నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, అనుబంధ విభాగాల నాయకులు సమన్వయంతో సాగాలి
- సమావేశ అజెండాను ప్రవేశపెట్టిన జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి
- ముఖ్య నేతలు, ప్రజాసంఘాలు, నియోజకవర్గ ప్రతినిధులు భారీగా హాజరు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీని జిల్లాలో క్షేత్రస్థాయి నుండి తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని తిరుపతి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాలగురువం బాబు పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి జిల్లా స్థాయి కమిటీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మరియు మండల కమిటీల సమగ్ర సమీక్షా సమావేశం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు బాలగురువం బాబు అధ్యక్షత వహించారు.

**క్షేత్రస్థాయి బలోపేతమే ధ్యేయం -- రాజకీయ శిక్షణ తరగతులు**

ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు బాలగురువం బాబు మాట్లాడుతూ.కాంగ్రెస్ పార్టీకి తిరుపతి జిల్లా పట్టుకొమ్మ అని,రాబోయే రోజుల్లో పార్టీని గడపగడపకూ తీసుకెళ్లేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యూహాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, విభాగాలు,మండల స్థాయి నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని కోరారు.పార్టీ సిద్ధాంతాలు, ప్రజాపోరాటాలపై మండల స్థాయి నాయకులు, కార్యకర్తలకు సమర్థవంతమైన నాయకత్వ పటిమను పెంపొందించేందుకు త్వరలోనే ప్రత్యేక "రాజకీయ శిక్షణ తరగతులు" నిర్వహించనున్నట్లు వెల్లడించారు.అంతకుముందు జిల్లా ప్రధాన కార్యదర్శి గండవరం రమేష్ రెడ్డి సమావేశ అజెండాను సమగ్రంగా ప్రవేశపెట్టి, పార్టీ అంతర్గత బలోపేతం మరియు భవిష్యత్ కార్యక్రమాల నిర్వహణపై సమగ్ర నివేదికను అందించారు.ఈ ముఖ్యమైన సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర,జిల్లా స్థాయి కీలక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర నేతలు:రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, జిల్లా ప్రతినిధులు తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కరీముల్లా, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ దాసరత్నం, జిల్లా రిప్రజెంటేటివ్ చైర్మన్ చిరంజీవి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంబాకం హరికృష్ణ,ఆదివాసి జిల్లా అధ్యక్షులు నాయక్,జిల్లా సెక్రటరీలు గోపి, ఇళయరాజా.నియోజకవర్గ ఇన్‌ఛార్జులు సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దెయ్యాల కిరణ్,శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తపాలా దామోదర్ రెడ్డి, స్థానిక, మండల నాయకులు సూళ్లూరుపేట టౌన్ ప్రెసిడెంట్ సునీల్ రెడ్డి, తడ మండల ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు శ్వేత, దొరవారిసత్రం మండల అధ్యక్షురాలు చాముండేశ్వరి, మహిళా నాయకురాలు సుజాత, తడ మండలం ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ లోకేష్ తదితర విభాగాలు, అనుబంధ సంఘాల నాయకులు విశేషంగా పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపిన ఈ సమావేశంలో నాయకులంతా పార్టీ విస్తరణకు శ్రమిస్తామని ఏకగ్రీవంగా పునరుద్ఘాటించారు.





## అవయవ దానంపై అవగాహన సదస్సు

**- పాల్గొన్న మంత్రి సత్య కుమార్ యాదవ్**



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం :** విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అవయవ దాన అవగాహన సదస్సులో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ అవయవ దానం మహోన్నత మానవతా సేవ. ఒక దాత ఎనిమిది మంది జీవితాల్లో వెలుగులు నింపగలడు.సమాజంలోని ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలి.ఈ దిశగా అవగాహన పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం 5,900 మంది అవయవ మార్పిడి కోసం ఎదురు చూస్తుండగా, 2025లో 93 మంది దాతల ద్వారా 301 ట్రాన్స్‌ప్లాంటేషన్లు, 2026లో ఇప్పటివరకు 57 మంది దాతల ద్వారా 180 మందికి పునర్జన్మ లభించింది.కూటమి ప్రభుత్వం ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలను 3 నుంచి 9కు పెంచి,మరింత మందికి నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టింది.అని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.



## ప్రపంచస్థాయి ఆరోగ్య సేవలందించడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

**- మంత్రి సత్య కుమార్ యాదవ్**





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యం అంటూ రాష్ట్ర వైద్య,ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆయన ఆదివారం విశాఖపట్నంలోని ఆరిలోవ,హెల్త్ సిటీలోని మేడయ్ మల్టీ స్పెషల్టీ హాస్పిటల్ లో అత్యాధునిక మిసో రోబోటిక్ ఆర్థోపాయిదిక్ సూరజికల్ సిస్టమ్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు (ఎఐ),3డి సిటి ఆధారిత సర్జికల్ ప్లానింగ్,రోబోటిక్ ప్రెసిషన్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను మరింత కచ్చితత్వంతో నిర్వహించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు. రోగులకు తక్కువ నొప్పి, వేగవంతమైన కోలుకోవడం,మెరుగైన చికిత్స ఫలితాలు అందించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అత్యాధునిక వైద్య సాంకేతికతను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా నాణ్యమైన,ప్రపంచ స్థాయి ఆరోగ్య సేవలను మరింత విస్తృతంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

## చిల్లకూరు ఫ్లైఓవర్‌పై ప్రమాదం.. డ్రైవర్ మృతి

**- గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న లారీ**

**- నాయుడుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన చెన్నైకు చెందిన అరుల్**



**పెళ్లకూరు– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు సమీపంలోని ఎన్‌హెచ్--71 జాతీయ రహ దారిపై ఉన్న ఫ్లైఓవర్‌పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కంటైనర్ లారీ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు, తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన అరుల్ (30) కంటైనర్ లారీలో స్పేర్ పార్ట్స్‌ను చెన్నై నుంచి కడపకు తరలించి సరుకును దిగజేసిన అనంతరం తిరిగి చెన్నైకి బయలుదేరాడు. ఈ క్రమంలో చిల్లకూరు ఫ్లైఓవర్‌పై ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం తీవ్రతకు లారీ ముందు భాగం పూర్తిగా ధ్వంసమవగా, డ్రైవర్ అరుల్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు, సహాయక సిబ్బంది సుమారు గంటపాటు శ్రమించి అతడిని బయటకు తీశారు. అనంతరం 1033 అంబులెన్స్ ద్వారా నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పెళ్లకూరు ఎస్ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలపై తిరుపతి జిల్లా పోలీసుల కఠిన చర్యలు

**- డ్రోన్ కెమెరాలతో జిల్లావ్యాప్తంగా కట్టుదిట్టమైన నిఘా**

**- ఆధునిక సాంకేతికతతో నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు**





**దొరవారిసత్రం– సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు తిరుపతి జిల్లా పోలీసులు సమగ్ర కార్యాచరణ చేపట్టారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి చర్యలపైనా ఉపేక్ష లేకుండా,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియో గిస్తూ నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.ఈ చర్యల్లో భాగంగా డ్రోన్ కెమెరాల ద్వారా అటవీ ప్రాంతాలు,మారుమూల గ్రామాలు,కొండ ప్రాంతాలు,గంజాయి సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాలు,ఇతర అనుమానాస్పద ప్రదేశాలపై ప్రత్యేక వైమానిక నిఘా నిర్వహిస్తున్నారు. భూమిపై పోలీసు బృందాల తనిఖీలతో పాటు డ్రోన్ పర్యవేక్షణను సమన్వయం చేయడం ద్వారా చట్టవ్యతిరేక కార్యకలాపాలను ప్రారంభ దశలోనే గుర్తించి వెంటనే అడ్డుకునే చర్యలు చేపడుతున్నారు.

ముఖ్యంగా గంజాయి సాగు,గంజాయి రవాణా, అక్రమ మద్యం తయారీ,జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి,వాటిలో పాల్గొనే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ చర్యనైనా ఉపేక్షించబోమని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,"శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకం.మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్–112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతాం. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కరపత్రాల పంపిణీ



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం కల్లూరు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు డాక్టర్ నెలవల విజయశ్రీ ఎమ్మెల్యే నాయకత్వంలో మండల అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మండల అధ్యక్షుడు ఇట్టగుంటవెంకటరత్నయ్య చేతుల మీదుగా కర పత్రాలు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల వివరాలు,ప్రజలకు అందిన ప్రయోజనాలు గురించి కరపత్రాల్లో వివరించారు. గ్రామస్తులకు నేరుగా అందజేస్తూ పథకాల ప్రాముఖ్యతను విశదీకరించారు.ఈ కార్యక్రమంలో ఇట్టగుంట వెంకటరత్నయ్య తో పాటు స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి పై జాతీయ జెండా కార్యక్రమన్ని విజయవంతం చేద్దాం...

**- బిజెపి మండల అధ్యక్షులు సురేష్ నాయుడు**

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం :** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమం ఇంటింటిపై జాతీయ జెండా ఎగరవేసే కార్యక్రమాన్ని మండలంలో అందరం కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని బిజెపి దొరవారి సత్రం మండల అధ్యక్షులు ఎస్ సురేష్ నాయుడు అన్నారు.ఆయన ఆదివారం తిరుపతి జిల్లా,సూళ్లూరుపేట అసెంబ్లీ పరిధిలోని దొరవారిసత్రం మండల సమావేశం పాల్గొన్నారు. ఈ మండల సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యవేడు మునికృష్ణయ్య,పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతంపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మండల కమిటీ,మోర్చా కమిటీ మరియు శక్తి కేంద్ర కమిటీల ఏర్పాటు చేపట్టారు. అనంతరం మండల ఇన్‌చార్జి గోపీ ఆచారి పాల్గొని ఎస్ఐఆర్‌పై సమీక్ష నిర్వహించడంతో పాటు "ఇంటింటిపై జాతీయ జెండా"కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే అంశంపై క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు చి.వెంకటరమణ నాయుడు సీనియర్ నాయకులు ఓ.ఈశ్వరయ్య,వి.చంద్రశేఖర్ జి.రవి రెడ్డి,వేంపల్లి సుధాకర్,మండల కార్యదర్శి టి. బాలాజీ,మండల కార్యవర్గ సభ్యులు ముద్దు కృష్ణ కార్యకర్తలు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )